సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 17 । జూలై । 2024




పదేళ్ల ప్రాయంలో వేనోళ్లా పొగిడేలా..
పట్టుదల ఉంటే సాధించలేనిదంటూ ఉండదని నిరూపించింది పెద్దాపురం మండలం ఆర్‌జీ పట్నం గ్రామ విద్యార్థి మన్యం పల్లవి.



మోడ్రన్ పెంటాథలాన్ పోటీలు ప్రారంభం
కాకినాడ జిల్లా క్రీడామైదానంలో మోడ్రన్ పెంటాథలాన్ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

8 లో

కడలిలోకి 78 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 78,791 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,000, సెంట్రల్ 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.35 అడుగులకు చేరింది.

ఆధిపచ్చ పోరు

- టీడీపీలో మున్సిపల్ మంటలు
- 2027లో గోదావరి పుష్కరాలు
- అప్పటిలోగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ పాలకవర్గం కొలువు తీరేలా ప్లాన్
- టీడీపీ సీనియర్ నేతలు ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మధ్య అగ్గి రాజేస్తున్న ఎన్నికల వ్యవహారం
- విలీన గ్రామాలతో ఎన్నికలకు వెళ్లాలని గోరంట్ల పట్టు
- విలీన గ్రామాలతో సంబంధం లేకుండా ఎన్నికలకు ఆదిరెడ్డి వర్గం పావులు
- విలీన గ్రామాలతో జరిగితే రాజమహేంద్రవరం సిటీలో తమ హవా తగ్గుతుందని ఆందోళన
- సీఎం వద్దకు పంచాయితీ
- ఇద్దరి మధ్య సయోధ్యపై మీమాంస



సాక్షి, రాజమహేంద్రవరం: పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి వర్గాల మధ్య రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల వ్యవహారం మరోసారి ఆధిపత్య మంటలు రేపుతోంది. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం అగ్నికి ఆజ్యం పోసిన చందంగా పరిణమిస్తోంది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేసి ఎన్నికలకు వెళ్లాలని ఎమ్మెల్యే గోరంట్ల పట్టుబడుతున్నారు. అదే జరిగితే తమ ఆధిపత్యానికి చెక్ పడుతుందని భావిస్తున్న ఆదిరెడ్డి వర్గం ఈ ప్రతిపాదనను అంగీకరించడం లేదు. గ్రామాల విలీనం అంశం పక్కన పెట్టి ఎన్నికలు నిర్వహించేలా వ్యూహరచన చేస్తోంది. ఇది ఎటూ తేలక పోవడంపై ఈ పంచాయితీ సీఎం చంద్రబాబు వద్దకు చేరినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇరు వర్గాల మధ్య ఆయన సయోధ్య కుదురుస్తారా, శత్రువులిద్దరూ మిత్రుల వుతారా అనే చర్చ ప్రజల్లో నడుస్తోంది.

ఇదీ సంగతి..

రాజమహేంద్రవరం మున్సిపాలిటీ 1994లో నగరపాలక సంస్థగా ఆవిర్భవించింది. తొలుత 54 డివిజన్లతో గ్రేటర్ రాజమహేంద్రవరం ఏర్పాటు చేయాలనుకున్నారు. తర్వాత లాలాచెరువుతో కలిపి 50 డివిజన్లు చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని 21 గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని భావించింది. తద్వారా 75 డివిజన్లు చేయాలని నిర్ణయించింది. ఇందుకు మాస్టర్ ప్లాన్ సైతం సిద్ధం చేసింది. ప్రభుత్వం మారిన అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని 10 గ్రామాలను విలీనం చేసేందుకు నిర్ణయం తీసుకుంది. శాటిలైట్ సిటీ, కాతేరు, హుకుంపేట, బొమ్మూరు, ధవళేశ్వరం, పిడింగొయ్యి, రాజవోలు, తొర్రేడు, వెంకటనగరం, వేమగిరి గ్రామాలకు సంబంధించి గెజిట్ సైతం విడుదల చేసింది. దీంతో పాటు రాజానగరం నియోజకవర్గంలోని లాలాచెరువును కూడా కార్పొరేషన్‌లో విలీనం చేసింది. విస్తీర్ణం పెంచి 52 డివిజన్లు చేయాలని భావించింది. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ రికార్డులను సైతం కార్పొరేషన్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఓటర్ల జాబితాలను సైతం విడదీశారు. ఇందులో ఒక గ్రామానికి చెందిన వారు కోర్టుకు వెళ్లడంతో విలీన ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుతం కోర్టు వ్యవహారం కొలిక్కి తెచ్చి, ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

సయోధ్య సాధ్యమేనా?

కార్పొరేషన్ ఎన్నికల పంచాయితీ సీఎం చంద్రబాబు వద్దకు వెళ్లినట్లు సమాచారం. చంద్రబాబు ముందు ఆదిరెడ్డి, గోరంట్ల తమతమ వాదనలు ఉంచినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఏం చేయాలనే దానిపై చంద్రబాబు మల్లగుల్లాలు పడుతున్నారని సమాచారం. గోరంట్లను విభేదిస్తే సీనియర్ నేతను పక్కన పెట్టారన్న అపవాదు మూటగట్టుకోవాల్సి వస్తుందని భావిస్తున్నారు. ఆదిరెడ్డి వర్గానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంటే తనయుడు లోకేష్ మాటకు విలువ లేకుండా పోతుందన్న మీమాంస నెలకొంది. ఈ క్రమంలో గోరంట్ల, ఆదిరెడ్డి మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. కొన్నేళ్లుగా ఆధిపత్య పోరుతో కొట్టుమిట్టాడుతున్న ఇరు వర్గాల మధ్య సయోధ్య సాధ్యమవుతుందా అనే ప్రశ్న రెండు నియోజకవర్గాల ప్రజల్లో ఉత్పన్నమవుతోంది.

కార్పొరేషన్ ఎన్నికలకు సీఎం నిర్ణయం

గోదావరి పుష్కరాలు 2027లో జరగనున్నాయి. 2015లో మహా పుష్కరాల పేరిట సుమారు రూ.2 వేల కోట్లు వెచ్చించారు. అంత భారీ స్థాయిలో నిధులు వెచ్చించే సమయంలో పాలకవర్గం లేకపోతే పుష్కరాల పనులు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించాల్సి వస్తుంది. ఇదే జరిగితే పుష్కరాల పేరుతో జేబులు నింపుకొనే అవకాశం టీడీపీ నేతలకు దక్కదు. ఈ విషయాన్ని ముందుగానే పసిగట్టిన సీఎం చంద్రబాబు పుష్కరాలు వచ్చేలోగా ఎలాగైనా ఎన్నికలు నిర్వహించాలని భావించినట్లు సమాచారం.

ఆదిరెడ్డి వర్గంలో ఆందోళన!

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో ప్రస్తుతం 50 డివిజన్లు ఉన్నాయి. అందులో 42 వార్డులు రాజమండ్రి సిటీ, 8 డివిజన్లు రూరల్ నియోజకవర్గంలో ఉన్నాయి. ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే కార్పొరేషన్ ఎన్నికల్లో గోరంట్ల ఆధిపత్యం పెరుగుతుంది. రాజమహేంద్రవరం నగరంలో సైతం ఆయన వర్గం హల్‌చల్ చేస్తోంది. కార్పొరేషన్ పాలకవర్గంలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా గోరంట్లకు స్థానం దక్కుతుంది. సీనియర్ ఎమ్మెల్యే వర్గం కార్పొరేటర్లు కార్పొరేషన్‌లో అడుగు పెడతారు. పాలనాపరమైన వ్యవహారాలు, నిధుల వెచ్చింపులో ఆయన వర్గం జోక్యం పెరుగుతుంది. సహజంగానే టీడీపీలోని తన చిరకాల ప్రత్యర్థి ఆదిరెడ్డి అప్పారావు వర్గానికి చెక్ పెట్టేలా గోరంట్ల పావులు కదుపుతారు. ఇది ఆదిరెడ్డి వర్గంలో ఆందోళనకు గురి చేస్తోంది. ఒకానొక దశలో గోరంట్ల రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే టికెట్టు ఆశించారు. చంద్రబాబుపై ఒత్తిడి సైతం పెంచారు. ఆ సమయంలో ఈ టికెట్టును తన తనయుడు వాసుకు దక్కించుకునేందుకు ఆయన తండ్రి ఆదిరెడ్డి అప్పారావు అనేక ప్రయత్నాలు చేశారు. గోరంట్ల సిటీలోకి అడుగు పెట్టకుండా లోకేష్ ద్వారా పావులు కదిపారు. చివరకు రాజమండ్రి సిటీలో గోరంట్ల కార్యాలయం ఏర్పాటు చేసినా విభేదించారు. చివరకు సార్వత్రిక ఎన్నికల్లో ఆయనను సిటీ నుంచి పక్కకు తప్పించగలిగారు. ఆయన వర్గాన్ని పక్కకు నెట్టారు. డివిజన్లలో తమ అనుచరుల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఇలా సిటీలో గోరంట్ల పెత్తనాన్ని ఎండగట్టేందుకు ఎప్పటికప్పుడు వ్యూహాలు రచిస్తున్న ఆదిరెడ్డి వర్గానికి గ్రామాల విలీనం ప్రస్తావన ఆందోళనకు గురి చేస్తోంది. దీన్ని ఎలాగైనా అడ్డుకోవాలన్న తలంపుతో ఇప్పటికే లోకేష్‌ను ఆశ్రయించినట్లు తెలిసింది. మరోవైపు బుచ్చయ్య చౌదరి సైతం అదే స్థాయిలో పైరవీలు సాగిస్తున్నారు. రూరల్ గ్రామాలు విలీనం చేస్తే నగరం మరింత అభివృద్ధి చెందుతుందని, ప్రభుత్వానికి సైతం మంచి పేరు వస్తుందని సీఎం చంద్రబాబుకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

20 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక శ్యామలా సెంటర్‌లోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లా ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ తెలిపారు. ఈ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను భాస్కర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ సమావేశాలకు జిల్లాలోని అన్ని మండలాల నాయకులు వస్తారన్నారు. జిల్లాలో ఉన్న సమస్యలపై, భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తామన్నారు. విద్య కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కాషాయికరణ చేసే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు గడువు పొడిగింపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2024కు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 18 వరకూ పొడిగించారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

కోటసత్తెమ్మ ఆలయంలో షాపులకు వేలం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని షాపులు, పూజా సామగ్రి విక్రయానికి సంబంధించి మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరి కాయలు, అరటి పండ్లు, పూజాద్రవ్యాల విక్రయానికి నెలకు రూ.2 లక్షల చొప్పున చెల్లించేందుకు నాగళ్ల సత్యవతి, కూల్ డ్రింక్స్, గ్రైండర్, కిరాణా, హోటల్ నిర్వహణకు నెలకు రూ.55 వేలకు, తాళ్లు, తావీదులు అమ్ముకొనే లైసెన్స్ హక్కులను ఏడాదికి రూ.10.45 లక్షల హెచ్చుపాటకు కలిదిండి కోటిలింగం దక్కించుకున్నారు. అమ్మవారి ఆలయానికి 8 నెలల ఒప్పందానికి కూరగాయలు సరఫరా చేసేందుకు కాటకోటేశ్వరానికి చెందిన కరిబండి నారాయణరావు పాడుకున్నారు. దేవదాయ శాఖ తాడేపల్లిగూడెం తనిఖీదారు ఎ.సుజన్ కుమార్, ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో ఈ వేలం జరిగింది. వేలంపాటలో గత ఏడాది కంటే ఆలయానికి ఆదాయం పెరిగిందని ఈఓ తెలిపారు. వేలం పాటలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ప్రధానార్చకుడు అప్పారావుశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ జగదీష్‌కు ఘనంగా వీడ్కోలు



ఎస్పీ జగదీష్‌ను గజమాలతో సత్కరిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బదిలీపై వెళ్తున్న జిల్లా ఎస్పీ పి.జగదీష్‌కు పోలీసులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్‌ఆర్ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యాన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీపై అధికారులు, సిబ్బంది పూలవర్షం కురిపించి, జేజేలు కొట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో తనకు సహకరించిన సిబ్బందికి, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీలు డి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 178 మంది హాజరు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా ఉద్యోగ కల్పన, శిక్షణ సంస్థ ఆధ్వర్యాన స్థానిక ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి వద్ద మంగళవారం నిర్వహించిన జాబ్ మేళా 178 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో తదుపరి ఎంపిక కోసం 73 మందిని షార్ట్‌లిస్ట్ చేశామని జిల్లా ఉపాధి అధికారి కె.హరీష్‌చంద్ర ప్రసాద్ తెలిపారు.

లారీ ఇసుక రూ.12,000

పిఠాపురం: 'ప్రభుత్వం ప్రకటించిన నూతన ఇసుక విధానం లోపభూయిష్టంగా ఉంది. ప్రస్తుతం లారీ ఇసుక ధర రూ.12 వేలు ఉంది. పాత ధరకే కొనుక్కోవలసి వస్తుంటే ఇది ఉచిత ఇసుక ఎలా అవుతుంది?' అని ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు ప్రశ్నించారు. ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ధర్నానుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ బూటకపు వాగ్దానాలకు ఉచిత ఇసుక మరో మచ్చుతునక అని విమర్శించారు. నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వం స్టాక్ పాయింట్లు పెట్టి, తక్కువ ధరకే ఇసుక ఇస్తే పేదలు సంతోషిస్తారని అన్నారు. ఉచితం అంటూ ప్రజలను మభ్యపెట్టవద్దని హితవు పలికారు. ఇసుక ప్రజలకు మరింత సులువుగా ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రద్ధ తీసుకోవాలని అంజిబాబు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు డి.నారాయణమూర్తి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలోని గ్రామీణ మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యాన చీరల పెయింటింగ్, ఎంబ్రాయిడరీపై సామర్లకోట టీటీడీసీలో 15 రోజుల పాటు ఈ శిక్షణ ఇస్తారన్నారు. ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కనీసం ఎనిమిదో తరగతి విద్యార్హత కలిగి 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన మహిళలు టీటీడీసీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అందుబాటులో 3,77,357 టన్నుల ఇసుక



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, ఇన్‌చార్జి జేసీ దినేష్ కుమార్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని ఏడు ఇసుక స్టాక్ పాయింట్లు, 31 డీసిల్టేషన్ పాయింట్ల వద్ద 3,77,357 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. తన క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రం నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్‌ఎస్‌సీ) సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, గోదావరి వరద ప్రభావం దృష్ట్యా డీసిల్టేషన్ పాయింట్ల వద్ద నిలువ ఉన్న ఇసుక వినియోగానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. నదీ పరీవాహక ప్రాంతంలో ఇసుక నిల్వలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాలకు, ప్రభుత్వ ప్రాధాన్య పనులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉచిత ఇసుక విధానంలో కేటాయించాలని, బల్క్ (పెద్ద మొత్తంలో) కేటాయింపులపై డీఎల్‌ఎస్‌సీ ఆమోదం తీసుకోవాలని స్పష్టం చేశారు. తన సిఫారసుల మేరకే ఇతర జిల్లాలకు రవాణా చేయాల్సి ఉంటుందని అన్నారు. ఇసుక పంపిణీపై సబ్ కలెక్టర్, ఆర్డీఓల వ్యక్తిగత పర్యవేక్షణ తప్పనిసరని పేర్కొన్నారు. కొవ్వూరు, తాళ్లపూడి గోదావరి గట్టు మార్గంలో సీసీ కెమెరాలతో 360 డిగ్రీల నిఘా పెట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. బల్క్ కేటాయింపుల కోసం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోను, ఇతర ప్రైవేటు ఏజెన్సీల నుంచి ఏడు ప్రతిపాదనలు వచ్చాయని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. వాటికి కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ కె.దినేష్ కుమార్, కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి, జిల్లా మైన్స్ సహాయ సంచాలకులు ఎం.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ఆర్ నిధులతో హాస్టళ్లకు మరమ్మతులు

సంక్షేమ వసతి గృహాల్లో చేపట్టాల్సిన మరమ్మతులను గుర్తించి, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) నిధులతో పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు ప్రతిపాదనలు అందజేయాలని, దీనిపై సమగ్రంగా చర్చిస్తామని చెప్పారు. సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై సంక్షేమ శాఖల అధికారులకు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో నిర్వహణ, మౌలిక సదుపాయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. వసతి గృహాలపై వివిధ పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రతికూల కథనాలు వస్తున్నాయని, సరైన నిర్వహణ దిశగా అడుగులు వేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక, గిరిజన, కొవ్వూరు బీసీ సంక్షేమ అధికారులు ఎం.సందీప్, కేఎస్ జ్యోతి, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ అసెట్‌ను సందర్శించిన ఎంపీ హరీష్



ఓఎన్‌జీసీ అసెట్‌లో మొక్క నాటుతున్న ఎంపీ హరీష్ మాధుర్, అసెట్ మేనేజర్ శంతనుదాస్

రాజమహేంద్రవరం రూరల్: ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం అసెట్‌ను అమలాపురం పార్లమెంటు సభ్యుడు జి.హరీష్ మాధుర్ మంగళవారం తొలిసారిగా సందర్శించారు. అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మేనేజర్ శంతనుదాస్, ఓఎన్‌జీసీ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అసెట్ కార్యకలాపాలపై ఎంపీ సమీక్షించారు. అసెట్‌లో మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మొక్క నాటారు. అనంతరం మాట్లాడుతూ రాజమహేంద్రవరం అసెట్ పరిధిలో ఓఎన్‌జీసీ కార్యకలాపాలకు పూర్తి మద్దతు ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధికి సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. భూసేకరణ, పైప్‌లైన్ నిర్మాణం వంటి సమస్యలపై ఆయా ప్రాంతాల్లోని స్థానికులతో చర్చలు జరిపి, సమాచారం పంచుకోవాలని అసెట్ మేనేజర్‌ను, అధికారులను కోరారు. ప్రతి విషయంలో స్థానికులతో కలిసి పని చేయాలని సూచించారు. ఓఎన్‌జీసీ భద్రతా విధానాలు, ఇతర అంశాలపై స్థానికులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద ఓఎన్‌జీసీ అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. ప్రతి విషయంలో స్థానికులతో కలసి పని చేయాలని ఎంపీ మాధుర్ కోరారు. అసెట్ మేనేజర్ శంతనుదాస్ మాట్లాడుతూ, ప్రాంతీయ అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి ఓఎన్‌జీసీ పూర్తిగా కట్టుబడి ఉందని అన్నారు. ఈ సందర్భంలో అసెట్ కార్యకలాపాలపై అధికారులు సంక్షిప్త ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో అసెట్ హెడ్‌లు, సీనియర్ అధికారులు తమ అభిప్రాయాలను ఎంపీ మాధుర్‌తో పంచుకున్నారు.

నిలకడగా..

- రైతుకు ఆనందం పంచుతున్న పొగాకు మార్కెట్
- కిలోకు గరిష్టంగా రూ.381 ఆదాయం
- కనిష్ట ధర రూ.235
- సగటు రాబడి రూ.313.94
- ఇప్పటి వరకూ రూ.1,232 కోట్ల అమ్మకాలు



దేవరపల్లి వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

దేవరపల్లి: వర్జీనియా పొగాకు మార్కెట్ నిలకడగా కొనసాగుతోంది. ఎన్నడూ ఊహించని ధరలతో రైతుకు ఆనందాన్ని పంచుతోంది. మొన్నటి వరకూ రోజు రోజుకూ పెరుగుతూ వచ్చిన ధరలు నాలుగు రోజులుగా నిలకడగా ఉన్నాయి. మన జిల్లాతో పాటు ఏలూరు జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో శనివారం కిలో గరిష్టంగా రూ.381, కనిష్టంగా రూ.235, సగటున రూ.313.94 చొప్పున ధర పలికింది. నెల రోజులుగా పొగాకు ధరలు అంచనాలకు అందని రీతిలో పెరగడంతో రైతు కుటుంబాల్లో ఎన్నడూ చూడని సంతోషం కనిపిస్తోంది. ఈ ఏడాది మార్కెట్‌లో పొగాకు ధర ఈ స్థాయిలో పలుకుతుందని ఇటు అధికారులు కానీ అటు రైతులు కానీ ఊహించలేదు. కిలోకు కనీసం రూ.300 లభిస్తే చాలని రైతులు ఆశించారు. కానీ, అంతకు మించి పలుకుతూండటంతో రైతులకు దండిగా ఆదాయం సమకూరుతోంది.

ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు మార్చి 6న ప్రారంభించారు. ప్రారంభంలో కిలో పొగాకు ధర రూ.240 మాత్రమే పలకడంతో రైతులు నిరుత్సాహం వ్యక్తం చేశారు. గత ఏడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుపానుకు పంట దెబ్బ తిందని, దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నందున ఈ ధర గిట్టుబాటు కాదని బోర్డు అధికారులు, కొనుగోలుదారుల దృష్టికి రైతులు తీసుకుని వెళ్లారు. కిలోకు రూ.300 ఇస్తే గిట్టుబాటు అవుతుందని చెప్పారు. ముందు ముందు మంచి రోజులు వస్తాయని, కంగారు పడవద్దని వారికి అధికారులు వివరించారు. మొదటి నెల రోజులూ వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు మందకొడిగా జరిగాయి. లో గ్రేడ్ పొగాకు విక్రయాలు నిర్వహించారు. ఒక దశలో కిలో లో గ్రేడ్ పొగాకుకు రూ.270 ధర లభించడంతో భవిష్యత్తులో మంచి ధర వస్తుందనే నమ్మకం రైతుల్లో ఏర్పడింది. ఏప్రిల్ వరకూ లో గ్రేడ్ పొగాకు అమ్మకాలే జరిగాయి. మే నెల నుంచి లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లను తాత్కాలికంగా నిలుపు చేసి, బ్రైట్ గ్రేడ్ (మంచి) పొగాకు కొనుగోలును వ్యాపారులు ఆరంభించారు. దీంతో మార్కెట్లో గరిష్ట, సగటు ధరలు గణనీయంగా పెరిగాయి. ఈ నెల ప్రారంభంలో కిలో గరిష్ట ధర రూ.368 పలకగా, ఇది క్రమంగా పెరుగుతూ మంగళవారం రూ.381కి చేరింది. కొనుగోలుదారుల మధ్య పోటీ ఏర్పడడంతో మార్కెట్లో పొగాకుకు మంచి ధర పలుకుతోందని అధికారులు అంటున్నారు.

39.37 మిలియన్ల కిలోల విక్రయం

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం–1, 2 వేలం కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకూ 39.37 మిలియన్ల కిలోల పొగాకు కొనుగోలు చేశారు. దీని విలువ రూ.1,232 కోట్లు ఉంది. ఇప్పటి వరకూ 3,13,128 బేళ్లు కొనుగోలు చేశారు. దేవరపల్లి వేలం కేంద్రంలో 97,376 కిలోలు, జంగారెడ్డిగూడెం–1లో 46,266 కిలోలు, జంగారెడ్డిగూడెం–2లో 91,963 కిలోలు, కొయ్యలగూడెంలో 89,042 కిలోలు, గోపాలపురం వేలం కేంద్రంలో 97,090 కిలోలు కలిపి మంగళవారం మొత్తం 4,21,740 కిలోల పొగాకు కొనుగోలు చేశారు. అమ్మకానికి 4,077 బేళ్లు రాగా, 3,440 బేళ్లు కొనుగోలు చేశారు.

ఇప్పటి వరకూ వేలం కేంద్రాల వారీగా జరిగిన పొగాకు కొనుగోళ్లు

(కిలోలు), ధరలు (రూ.లు)

వేలం కేంద్రం	కొనుగోళ్లు	గరిష్ట ధర	కనిష్ట ధర	సగటు ధర
దేవరపల్లి	66,67,499	381	205	311.18
జంగారెడ్డిగూడెం-1	87,06,153	381	235	312.73
జంగారెడ్డిగూడెం-2	85,63,367	381	235	314.73
కొయ్యలగూడెం	81,52,623	381	235	312.65
గోపాలపురం	72,89,270	381	235	318.41

మంచి ధర పలుకుతోంది



మార్కెట్లో పొగాకుకు మంచి ధర పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉండటంతో వ్యాపారులు పోటీ పడి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయి. కిలో సగటు ధర రూ.313.94 లభించింది. వేలం 102 రోజులు జరిగింది. వేలం కేంద్రాలకు బేళ్లు తక్కువగా వస్తున్నాయి. 35 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొంటున్నారు. వర్షాలు పడుతున్నందున రైతులు తమ వద్ద ఉన్న పొగాకును త్వరగా అమ్ముకోవాలి. వర్షాలకు పొగాకు నాణ్యత దెబ్బ తినే అవకాశం ఉంటుంది.

– జీఎల్‌కే ప్రసాద్, రీజినల్ మేనేజర్, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

కాలువలో పడి గేదెల కాపరి మృతి


కాలువలో పడి మృతి చెందిన అశోక్

గోపాలపురం: చింతలపూడి కాలువలో పడి గేదెల కాపరి మృతిచెందిన ఘటన గోపాలపురం మండలం గుడ్డిగూడెంలో జరిగింది. గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ కథనం ప్రకారం గుడ్డిగూడెం గ్రామానికి చెందిన మాదుగుల అశోక్(26) సోమవారం గేదెలను ఇంటికి తోలుకు వస్తున్న సమయంలో చింతలపూడి కాలువ వద్ద ప్రమాదవశాత్తూ కాలు జారి పడటంతో అతని ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం కాలువలో వెతకగా అతని మృతదేహం లభించినట్లు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

లచ్చిరెడ్డిపాలెంలో డీఎస్పీ విచారణ

రౌతులపూడి: తనను గిరిజన కులానికి చెందిన ఒక వ్యక్తి నమ్మించి మోసం చేశాడని మండలంలోని లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గిరిజన బాలిక ఇటీవల ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. రౌతులపూడి ఎస్.ఐ వెంకటేశ్వరరావు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసుపై పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి ఆధ్వర్యంలో ఈ విచారణ జరిగింది. బాలిక, ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తుల నుంచి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల విస్తరణాధికారిణి జానక్షిలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం


అనిల్‌కుమార్ (ఫైల్)

శంఖవరం: కాకినాడ పట్టణానికి చెందిన 13 ఏళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. అన్నవరం పోలీసుల వివరాల ప్రకారం కాకినాడకు చెందిన రసబోయిన అనిల్‌కుమార్ 7వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 9వ తేదీన వినోద్‌ను తల్లి బాగా చదువుకోవాలని మందలించింది. తల్లిపై కోపంతో అమ్మమ్మ ఊరు శంఖవరం వచ్చాడు. శంఖవరం వచ్చిన విషయం బాలుడు తల్లికి అమ్మమ్మ చెప్పడంతో కోపంతో పరారయ్యాడు. బాలుడు ఆచూకీ కోసం అమ్మమ్మ ఇల్లు, బంధువుల ఇళ్లలో వెతికినా లభించలేదు. దీంతో బాలుడు తండ్రి, తాతయ్య అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాలుడి సమాచారం తెలిస్తే అన్నవరం పోలీస్ స్టేషన్‌కు తెలియపరచవలసిందిగా ఎస్సై ఐ.కిశోర్ కోరారు.

పదేళ్ల ప్రాయంలో వేనోళ్లా పొగిడేలా..

- జిమ్నాస్టిక్, స్విమ్మింగ్, రైఫిల్ షూట్, రన్నింగ్ పోటీల్లో మేటి
- క్రీడా రంగంలో దూసుకుపోతున్న ఆర్‌బీ పట్నం విద్యార్థి పల్లవి


సాధన చేస్తున్న బాలిక పల్లవి


రైఫిల్ షూటింగ్‌లో తలపడుతున్న పల్లవి

పెద్దాపురం: పట్టుదల ఉంటే సాధించలేనిదంటూ ఉండదని నిరూపించింది పెద్దాపురం మండలంలోని ఆర్‌బీ పట్నం గ్రామ విద్యార్థి మన్యం పల్లవి. పట్టుమని పదేళ్లు లేవు. కానీ పట్టుబడితే మాత్రం ఆ ప్రాయంలోనూ పతకాలు వచ్చి తీరాల్సిందే అని నిరూపించింది. ఆ బాలిక క్రీడలలో నాలుగు విభాగాల్లో తనదైన శైలిలో ఉత్తమ ప్రతిభ కనపరుస్తూ ముందుకు దూసుకుపోతోంది. ప్రభుత్వ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న పల్లవి జిమ్నాస్టిక్, స్విమ్మింగ్, రైఫిల్ షూట్, రన్నింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరుస్తూ మండలానికే పేరు తెచ్చింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు సొంతం చేసుకుంది.

కార్పొరేట్ విద్యార్థి ప్రతిభకు దీటుగా..

కార్పొరేట్ స్కూళ్లలో క్రీడలకు ఇచ్చే ప్రాధాన్యానికి మించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో ఆటలకు పెద్దపీట వేసింది. దీన్ని ఆ తల్లిదండ్రులు ఓ చక్కటి అవకాశంగా తీసుకున్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో విద్య కంటే తాము చదువుకున్న ప్రభుత్వ పాఠశాలలోనే తన కుమార్తె చదవాలని ఆస్తి, అంతస్తులున్నా ఓ మంచి ఆశయం కోసం ప్రభుత్వ పాఠశాలలోనే ఆ బాలికను తల్లిదండ్రులు మన్యం వెంకటలక్ష్మి, చిన్న చదివిస్తున్నారు. అయితే ఆమెలో ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించిన తండ్రి ఓ పూట జిమ్నాస్టిక్, మరొక పూట కోచ్‌లు షేక్ రాజ్, నాయుడు దగ్గర స్విమ్మింగ్ నేర్పించారు. అప్పుడప్పుడూ అథ్లెటిక్స్ కాంపిటేషన్స్, లాంగ్ జంప్, రన్నింగ్ పోటీల్లో పాల్గొంటూ జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించింది. జిల్లా క్రీడా స్టేడియంలో వారానికి ఒకటి, రెండు సార్లు రైఫిల్ షూటింగ్ శిక్షణ తీసుకుంది.

నాన్నకు ప్రేమతో...

చదువుతో పాటు క్రీడల పట్ల రాణించాలన్న తన తండ్రి సంకల్పాన్ని పల్లవి చిన్నతనంలోనే అర్థం చేసుకుంది. ఆయన ప్రోత్సాహంతో 2018 నుంచి జిమ్నాస్టిక్, స్కేటింగ్, స్విమ్మింగ్, రన్నింగ్‌లో తర్ఫీదు పొంది మంచి ప్రతిభను కనబరుస్తూ ముందుకు దూసుకుపోతోంది పదేళ్ల పల్లవి.

రోజూ మూడు గంటల సాధన

మా ఊరిలో కబడ్డీ పోటీలు జరుగుతున్నప్పుడు నాన్న పోటీలకు తీసుకువెళ్లేవారు. దీంతో నాకు కూడా క్రీడలపై ఆసక్తి పెరిగింది. నాన్న రోజూ కాకినాడ తీసుకువెళ్లి స్కేటింగ్ శిక్షణ ఇప్పించేవారు. మూడు గంటల పాటు సాధన చేసేదాన్ని. నాకు నాలుగున్నరేళ్లు వచ్చిన తరువాత జిమ్నాస్టిక్, స్విమ్మింగ్‌లో శిక్షణ ప్రారంభించాను. ఇప్పుడు నా వయసు పదేళ్లు. అంతర్జాతీయ పోటీల్లో రాణించేందుకు నిరంతరం సాధన చేస్తున్నా అని చెబుతోంది పల్లవి. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని మనమూ..పల్లవికి ఆల్ ది బెస్ట్ చెబుదామ మరి!


సాధించిన బహుమతిని చూపిస్తున్న పల్లవి

విజయాల పరంపర

2019లో జోనల్ స్థాయిలో నిర్వహించిన రోలర్ స్కేటింగ్ పోటీల్లో ప్రథమ స్థానం. 2022లో కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో ప్రథమ స్థానం, గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో ద్వితీయ స్థానం, విశాఖపట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో ప్రథమ స్థానం, గత ఏడాది ఆగస్టు 13,14 తేదీల్లో మహారాష్ట్ర పూణెలోని శ్రీ శివ్‌ఛత్రపతి స్పోర్ట్స్ మైదానంలో జరిగిన 11వ జాతీయ జిమ్నాస్టిక్ పోటీల్లో తృతీయ స్థానం సాధించింది. ఇటీవల కర్నూలు జిల్లాలోని స్విమ్మింగ్ పోటీల్లో తృతీయ స్థానం సాధించి పలు బహుమతులు అందుకుంది. జిమ్నాస్టిక్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపర్చిన పల్లవి జాతీయ స్థాయిలో అండర్–10 కారణంగా వయసు తక్కువ కావడంతో జాతీయ స్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు అర్హత సాధించలేకపోయింది.

కార్మిక చట్టాల అమలుకు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కాకినాడ సిటీ: ఎల్‌పీజీ గ్యాస్ కంపెనీలలో కార్మిక చట్టాలు అమలు చేయాలని, కార్మికులందరికీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, ఐడీ కార్డులు అందజేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాడ్యుటీ, జాతీయ సెలవులు, పండగ సెలవులు, వారంతాపు సెలవులు అమలు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం డిమాండ్ చేసింది. మంగళవారం కచేరిపేటలోని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశంలో పలువురు మాట్లాడారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. కార్మిక చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్‌లు అమలు చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. లేబర్ కోడ్లు అమలులోకి వస్తే కార్మికులు కట్టుబానిసలుగా మారతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు కార్మికులకు ఐడీ కార్డులు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వడంలేదన్నారు. యూనియన్లు పెట్టుకుంటే వారిని విధుల నుంచి తొలగిస్తున్నారన్నారు. గ్యాస్ కంపెనీలలోని కార్మికులకు ఉద్యోగ భద్రత, ఉపాధి భద్రత కల్పించాలని, చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ నాయకులు జి.రాజ్‌కుమార్, నాయుడు, ప్రసాద్, సత్తిబాబు, వీరబాబు, నాగబాబు, సత్యనారాయణ, రాంబాబు, ప్రసన్నకుమార్ మాట్లాడారు.

మోడ్రన్ పెంటాథలాన్ పోటీలు ప్రారంభం

10 జిల్లాల నుంచి 300 మంది హాజరు


పోటీలను ప్రారంభిస్తున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, చిత్రంలో డీఎస్‌డీఓ శ్రీనివాసకుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో మోడ్రన్ పెంటాథలాన్ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను మోడ్రన్ పెంటాథలాన్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో రన్నింగ్, స్విమ్మింగ్, షూటింగ్ విభాగంలో నిర్వహించిన పోటీలకు 10 జిల్లాల నుంచి 300 క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మరో ముఖ్య అతిథి డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి క్రీడాకారులు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులు ఆగస్టు 14 నుంచి 18 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం చప్పిడి వెంకటేశ్వరరావు జెండా ఊపి లాంఛనంగా పోటీలు ప్రారంభించారు. షూటింగ్, స్విమ్మింగ్, రన్నింగ్‌లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంఘ రాష్ట్ర నిర్వహణా కార్యదర్శి కృష్ణ, డీఎస్ఏ కోచ్ అప్పల నాయుడు, కార్యవర్గ సభ్యులు జగన్, శ్రీహరి, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

21న బీచ్ కబడ్డీ జిల్లా జట్టు ఎంపికలు

జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21న బీచ్ కబడ్డీ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్టు సంఘ కార్యదర్శి చేదులూరి మణి వీరకంఠ మంగళవారం తెలిపారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ బీచ్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. 85 కేజీలు, 75 కేజీల లోపు ఉన్న పురుషులు, మహిళలు ఈ ఎంపికలకు ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన జట్టు ఆగస్టు 2 నుంచి 4 వరకు నెల్లూరు జిల్లాలో జరిగే అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటుందని సూకరాజు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ ఎంపికలకు హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎనిమిది మంది ఎంపిక


అందుకున్న బహుమతులతో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన 8 మంది క్రీడాకారులు

అమలాపురం టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విద్యానిధి స్కూలులో మంగళవారం జిల్లా స్థాయి అండర్–19 జూనియర్స్ చెస్ చాంపియన్ షిప్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ప్రతిభ చాటిన ఎనిమిది మంది బాల బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపియ్యారు. జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో ద్రాక్షారపు సాత్విక్ ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్ షిప్‌ను గెలిచాడు. ఇదే విభాగం నుంచి బండారు నాని బాబు ద్వితీయ స్థానాన్ని, తోలేటి శ్రీకాంత్ తృతీయ స్థానాన్ని, కొండ శివేంద్ర నాలుగో స్థానాన్ని కై వసం చేసుకున్నారు. బాలికల విభాగంలో గుత్తుల వైష్ణవి ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్ షిప్‌ను సాధించింది. ఇదే విభాగంలో నూకపెయ్యి హన్విక ద్వితీయ స్థానాన్ని, జాన్ బ్లెస్సీ తృతీయ స్థానాన్ని, పినిశెట్టి ధరణి నాలుగో స్థానాన్ని కై వసం చేసుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన ఈ ఎనిమిది మంది ఈ నెల 18వ తేదీ నుంచి నంద్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో తలపడతారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వెంకట సురేష్ తెలిపారు. అమలాపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 18 మంది జూనియర్ చెస్ క్రీడాకారులు హాజరయ్యారు. చివరిగా విజేతలకు విద్యా నిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

బాలికపై అత్యాచార యత్నం

కాట్రేనికోన: మండలంలోని చిర్రయానం సమీపంలో ఈ నెల 12వ తేదీన ఆరేళ్ల బాలికపై పినపోతు సత్తిబాబు(30) అనే వ్యక్తి అత్యాచార యత్నానికి ప్రయత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాట్రేనికోన ఎస్ఐ బి.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం పల్లం గ్రామానికి చెందిన మైనర్ బాలిక తల్లిదండ్రులు చిర్రయానం సమీపంలో పీతల చెరువులు సాగు చేస్తూ అక్కడే నివసిస్తుంటారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న బాలిక ఈ నెల 12వ తేదీన పాఠశాలకు వెళుతుండగా మార్గం మధ్యలో సత్తిబాబు అడ్డగించి అత్యాచార యత్నం చేశాడు. అయితే బాలిక కేకలు వేయడంతో రోడ్డుపై వెళుతున్న కొందరు యువకులు వచ్చి కామాంధుడికి దేహశుద్ధి చేశారు. మైనర్ బాలిక తండ్రి ఫిర్యాదుపై అత్యాచార యత్నం కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఈ ఘటనపై సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో పోలీసులు తప్పనిసరై కేసు నమోదు చేసినట్లుగా తెలుస్తోంది.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

మామిడికుదురు: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో తొమ్మిది దొంగతనాలకు పాల్పడిన నిందితుడు రాజోలు మండలం కాట్రేనిపాడుకు చెందిన రేఖపల్లి నాగరాజును మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. నగరం ఎస్సై ఎస్.సురేష్ నగరం పోలీస్ స్టేషన్‌లో ఈ కేసులకు సంబంధించిన వివరాలను తెలిపారు. మామిడికుదురు మండలం మగటపల్లి గ్రామంలో ఒక ఇంట్లో చోరీ చేసిన బంగారు వస్తువులను స్వాధీనం చేసుకుని విచారణ చేయగా పలు దొంగతనాలకు పాల్పడిన విషయం బయటపడిందన్నారు. మలికిపురం, అమలాపురం టౌన్, అమలాపురం రూరల్, పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి, గోకవరం, కోరుకొండ, నల్లజర్ల, రామచంద్రపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యిందని ఎస్సై సురేష్ తెలిపారు. తొమ్మిది దొంగతనాలకు సంబంధించి నిందితుడు నాగరాజు వద్ద నుంచి 160 గ్రాముల బంగారం, రూ.80 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం విలువ రూ.11 లక్షలు ఉంటుందని ఎస్సై తెలిపారు. ఈ కేసులో ముద్దాయిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎస్సై సురేష్, క్రైం సిబ్బంది బొక్కా శ్రీనివాసు, పీసీ డి.చిరంజీవికృష్ణ, నగరం పోలీస్ స్టేషన్ సిబ్బందిని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో ఒడిశా మహిళ మృతి


రీతాంజలి మృతదేహం


కొడుకుతో రీతాంజలి గౌడ స్వైన్ (పాత చిత్రం)

కాకినాడ రూరల్: భవన పనుల్లో భాగంగా సీలింగ్, హోల్‌టెక్ పనులతో జీవనోపాధి పొందేందుకు ఒడిశా నుంచి వచ్చిన కార్మికుల కుటుంబాలలో ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని సర్పవరం గ్రామ పరిధిలోని భవనారాయణ పురంలో మంగళవారం చోటు చేసుకుంది. సర్పవరం పోలీసుల వివరాల ప్రకారం ఒడిశాలోని ఖైరాపూటి ప్రాంతం గంజాపూర్‌కు చెందిన రీతాంజలి గౌడ స్వైన్(31) మంగళవారం భావనారాయణ పురం అద్దె ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందింది. భర్త, కుమారుడితో కలిసి ఆమె నివాసం ఉంటుండగా, సమీపంలో ఆమె చెల్లెలి కుటుంబం ఉంటోంది. ముక్కు నుంచి రక్తం కారడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా భావిస్తున్నారు. భర్త నేలు స్వైన్ తన కొడుకుతో పరారు కావడం అనుమానాలకు తావిస్తోంది. బంధువులు మాత్రం హత్య ఆరోపణ చేస్తున్నారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఏఎస్సై నాగేశ్వరరావు, సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించి, చుట్టుపక్కల వారు, ఒడిశాకు చెందిన వారిని విచారించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

మెదక్ జిల్లాలో తప్పి పోయిన బాలిక సామర్లకోటలో గుర్తింపు



తప్పిపోయిన బాలికను తండ్రికి అప్పగించిన రైల్వే ఎస్సై, సిబ్బంది

సామర్లకోట: ఇంటి నుంచి ఫిబ్రవరి నెలలో వెళ్లిపోయిన ఒక బాలికను రైల్వే పోలీసులు మంగళవారం సాయంత్రం గుర్తించి తండ్రికి అప్పగించిన ఘటన ఇది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం మెదక్ జిల్లా మాసాయిక్‌పేట మండలం, పోతనపల్లి గ్రామానికి చెందిన రాజోలు రాజేశ్వరీ ఫిబ్రవరి నెలలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. దానిపై తండ్రి బాలరాజు సికింద్రాబాద్‌లో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు. అక్కడి నుంచి అన్ని రైల్వే పోలీసు స్టేషన్‌లకు సమాచారం వచ్చింది. ఈ మేరకు మంగళవారం సామర్లకోట రైల్వే ప్లాట్‌ఫారంపై అనుమానంగా తిరుగుతున్న బాలికను రైల్వే పోలీసులు తనిఖీ చేశారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లో ఇచ్చిన ఫిర్యాదులో ఉన్న గుర్తులతో బాలిక ఉండటంతో ఆమె నుంచి పోలీసులు పూర్తి సమాచారం సేకరించారు. ఈ మేరకు తప్పి పోయిన రాజేశ్వరీగా గుర్తించి ఆమె వివరాలను తల్లిదండ్రులు, బంధువులకు తెలియజేశారు. దాంతో తండ్రి బాలరాజు రావడంతో కౌన్సెలింగ్ చేసి బాలికను అప్పగించామని ఎస్సై బి.లోవరాజు తెలిపారు. బాలికను గుర్తించిన రైల్వే పోలీసులను ఎస్సై అభినందించారు.

ఏటిమొగలో సీసీ కెమెరాల ఏర్పాటు


ఏటిమొగ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కాకినాడ సిటీ: జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ సాధారణ ఎన్నికల సమయంలో ఏటిమొగలో పర్యటించినప్పుడు స్థానిక ఏటిమొగ ప్రజలు తమ ప్రాంతంలో చోరీలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం ఏటిమొగ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాకినాడ డీఎస్పీ కె.హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వీఎల్‌వీకే సుమంత్, ఆధ్వర్యంలో పోర్టు పోలీస్ స్టేషన్ సిబ్బంది సీసీ కెమెరాలు ఏటిమొగ ముఖ్య ప్రదేశాల్లో ఏర్పాటు చేశారు.

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్


పోలీసుల స్వాధీనంలో ఉన్న ఇసుక లారీ

అయినవిల్లి: కె.గంగవరం మండలంలోని ముక్తేశ్వరం–కోటిపల్లి రేవులో మాన్సాస్ ట్రస్టు భూముల్లో నుంచి తువ్వ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు స్థానిక ఎస్సై వి.రాజేష్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి కె.గంగవరం మండలం పరిధిలోని ముక్తేశ్వరం–కోటిపల్లిరేవులో మాన్సాస్ ట్రస్టు భూముల్లో అక్రమంగా తువ్వ ఇసుక తరలిస్తుండగా ట్రస్టు అధికారులు ఫిర్యాదు చేయడంతో అయినవిల్లి పోలీసులు తువ్వ ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీ స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం లారీని అయినవిల్లి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు.

చేనేత సొసైటీలో రూ.3 లక్షల చీరల మాయం

పోలీసులకు ఫిర్యాదు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక చేనేత సహకార సంఘంలో రూ.3లక్షల విలువైన చీరలు మాయమయ్యాయి. చేనేత జౌళిశాఖ అధికారులు చీరలు మాయమైన ఘటనపై అమలాపురం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సహకార బ్యాంకు లెక్కలు చూస్తుండగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన పిల్లి లక్ష్మీ సరస్వతి ప్రొడక్షన్ క్లర్క్‌గా పని చేస్తున్నారు. సొసైటీ వస్త్ర నిల్వల గొడౌన్ తాళాలు ఆమె వద్దే ఉంటాయి. ఈ సమాచారం తెలుసుకున్న చేనేత జౌళిశాఖ అధికారి, సొసైటీ పర్సన్ ఇన్చార్జి మెట్టి గౌరీశంకరరాజు సిబ్బందిని విచారించారు. సొసైటీలో రూ.3,06,080 విలువైన 456 చీరలు దశలవారీగా మాయమైనట్టు గుర్తించారు. సొసైటీ తాళాలను అప్పుడప్పుడూ సొసైటీలో పనిచేస్తున్న మరో వ్యక్తికి ఇచ్చినట్టు ఆమె చెబుతున్నట్టు అధికారులు తెలిపారు. ప్రొడక్షన్ క్లర్క్ ఒక్కరే వస్త్ర నిల్వలను మాయం చేశారా లేక మరెవరైనా చేయించారా అన్న విషయం తేలాల్సి ఉంది. దీనిపై విచారణ జరిపి కేసు నమోదు చేయనున్నట్లు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు మంగళవారం రాత్రి తెలిపారు.

మద్యం తాగి బైక్ నడిపిన 10 మందికి రెండు రోజుల జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో 10 మందికి రెండురోజులు జైలు శిక్ష విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ రెండవ తరగతి మేజిస్ట్రేట్ వి.నరసింహారావు మంగళవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే గంగనాపల్లికి చెందిన కంఠం శ్రీనివాస్‌కుమార్, ఎస్.అచ్యుతాపురానికి చెందిన వినపర్తి చంద్రరావు, సహాపురానికి చెందిన బుద్దల దుర్గా సురేష్, కాకినాడకు చెందిన కోన శ్రీనివాసరావు, ఎస్.రాయవరానికి చెందిన మిరియాల రఘు, కృత్తివెన్నుకి చెందిన దోమ బాలరామకృష్ణ, కాకినాడకు చెందిన మహమ్మద్ వల్లి, కొవ్వూరుకి చెందిన రెడ్డి వీర విష్ణు, రౌతులపూడికి చెందిన కడారి నాగబాబు, వడ్లమూరుకి చెందిన పువ్వుల సుబ్బారావు మద్యం సేవించి బైక్‌పై వివిధ ప్రాంతాలలో వెళ్తుండగా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా 10 మందికి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మద్యం తాగి బైక్ నడిపిన ఆరుగురికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య

సీతానగరం: మండలంలోని మునికూడలి దుర్గమ్మ గుడి పుంత రోడ్డులో గుర్తు తెలియని 35 ఏళ్ల నుంచి 45 ఏళ్ల లోపు వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. రాజంపేటకు చెందిన కవల కృష్ణమూర్తి పొలంలో కాలువ బోదెలో ఉన్న వేప చెట్టుకు మొక్కజొన్న సంచులతో ఉరి వేసుకున్నాడు. సంచులు తెగి పోవడంతో మృతదేహం పంట బోదెలో పడింది. రెండు రోజుల నుంచి వర్షాల వల్ల రైతులు పంట పొలం వైపు వెళ్లకపోవడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీఆర్వో ఎస్.రత్న కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడి శరీరంపై తెలుపు, నీలంరంగు గళ్ల చొక్కా, నీలం రంగు జీన్ ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. వివరాలు తెలిస్తే 94409 04832 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు.

కాంక్రీట్ మిక్స్ మెషీన్‌లో పడి యువకుడి మృతి


బుర్రా సత్యసాయి (ఫైల్)

సామర్లకోట: పిఠాపురం మండలం లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన ఒక యువకుడు పనిచేస్తున్న కంపెనీలో మంగళవారం ప్రమాదవశాత్తూ మృతి చెందిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం సామర్లకోట మండలం అచ్చంపేట శివారు కొప్పవరం ఇస్కాన్ టెంపుల్ వద్ద ఉన్న జననీ కాంక్రీట్ రెడీ మిక్స్ కంపెనీలో పని చేస్తున్న యువకుడు బుర్రా సత్యసాయి(18) ఈ దుర్ఘటనలో మృతిచెందాడు. మెషీన్ క్లీనింగ్ విధానాన్ని పరిశీలించే సమయంలో బెల్టు లాగి వేయడంతో మెషీన్‌లోనికి పోయి నుజ్జునుజ్జు అయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై మౌనిక ఘటనా ప్రదేశానికి చేరుకొని సమాచారం సేకరించారు. మెషీన్ నుంచి మృతదేహాన్ని ఎస్సై ఆధ్వర్యంలో బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ స్టెల్లా కాలేజ్ (ఉమెన్స్) విజయవాడలో B.Sc. ఫోరెన్సిక్ సైన్స్ / అగ్రికల్చర్ / AI & ML / మెడికల్ ఇమేజింగ్ (రేడియాలజీ); BBA - 3 సంll ల కోర్సులు. అర్హత : ఇంటర్. UGC & కృష్ణా యూనివర్సిటీ గుర్తింపు. హాస్టల్ కలదు. సంప్ర : 84658 74867, 99121 78237 [V- 2624]

Real Estate

FLAT FOR SALE
■ 1590 sft Flat in 4th Floor, Oxygen Towers, A.V. Apparao Road, RJY, with U/d Share 63 sqyds. For Sale Cont: 8374568999 [C-800321]

Services

■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 9872006329. [T-264]

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/– మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయ గలరు. 95026 15217 [M-1185353]

■ కన్సల్టెన్సీ కాదుVIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15000 -40000,ఫ్రీరూం+భోజనం.HYD.7995984445 [HA-354]

■ టీమ్ లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్ బ్యాంక్ అనుబంధ సంస్థలో కావలెను. Sal + Inc. 40 వేలు, వ: 30+ Q: 10th +, రిటైర్డ్, వ్యాపారస్తులు, RMP డాక్టర్స్, గృహిణులు, ఇన్సూరెన్స్ ఏజంట్స్‌కు, మార్కెటింగ్‌కు. ✆ 63039 16733, 99666 34511 [B-165]

■ Foton Decors కంపెనీ నందు పనిచేయుటకు Marketing Executives (M) కావలెను. టూ వీలర్ తప్పనిసరి. సంప్రll 88826 56789 [R-1229027]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.